

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# లైసెన్స్ లేకుండా తయారు చేస్తున్న విత్తనాలు సీజ్

**-రూ 30 లక్షల విలువ గల వెయ్యి మొక్కజొన్న ప్యాకెట్లు**

**మేడ్చల్, అక్టోబర్ 1. ప్రభాతవార్త ః**

లైసెన్స్ లేకుండా తయారు చేసిన విత్తనాల ప్యాకెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన సంఘటన మేడ్చల్ పోలస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామంలోని సమృద్ధి అగ్రోటిక్ ప్లాంట్‌లో అనుమతి లేకుండా విత్తనాలను తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మండల వ్యవసాయ అధికారి అర్చన, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లైసెన్ లేకుండా ప్లాంట్‌లో కరోనా పేరుతో గల కవర్లల్లో మక్కజొన్న విత్తనాలను ప్యాక్ చేస్తున్నట్లు గుర్తించి సుమారు రూ. 30 లక్షల విలువగల వెయ్యి ప్యాకెట్లను సీజ్ చేశారు. అనంతరం సీజ్ చేసిన విత్తనాలను మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో అందించగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి



మేడ్చల్‌లో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహారెడ్డి తదితరులు

**మేడ్చల్, అక్టోబర్ 1. ప్రభాతవార్త ః** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విదంగా ప్రజలు సహకరించాలని మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహరెడ్డి కోరారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మున్సిపల్ 14వ వార్డులో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చైర్మన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛమైన పరిశుభ్రత పరిసరాల కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని అన్నారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే ఇప్పుడు మనం పరిసరాలను కలుషితం చేయకుండా పచ్చదనాన్ని పెంపొందించి వాతావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే చెత్తను వేయకుండా మున్సిపల్ వాహనాలకే చెత్తను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, పట్టణ మాజీ ఉప సర్పంచ్ నర్సింహరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలి

**-వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**

ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని రెండు పడగ గదులు పంపిణీ చేయాలని కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ హౌసింగ్,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ లో ఫ్యామలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని ఆయా జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఫ్యామలీ డిజిటల్ కార్డు,ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు,రెండు పడక గదులు,కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,కొడంగల్ తహసీల్దార్ కార్యాలయం నుండి హాజరైయ్యారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ....ఈనెల3వ తేది నుంచి ఫ్యామలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక మున్సిపల్ ,గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికి తిరిగి సేకరించాలని దీనికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు.సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన ,మరణించిన వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాలని ఆదేశించారు.ఈనెల 8వ తేది వరకు ఇది పూర్తి చేయాలని ,9వ తేది స్క్రూటీని ఉంటుందని 10వ తేది రిపోర్ట్ సబ్మిషన్ ఉంటుందని తెలిపారు.ఈ పైలట్ ప్రాజెక్టు ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా మిగితా సర్వే పనులపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఏఏ జిల్లాలో ఎన్ని ఉన్నాయి?,ఎన్ని పూర్తి చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులు నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని రెండు పడక గదులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు.ఇంకా ఏమైనా పనులు చేయాల్సి ఉంటే వెంటనే పూర్తి చేసి త్వరలో పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాళ్లకు రూ.500 అదనంగా బోనస్ అందజేయనుందని తెలిపారు.సన్న,దొడ్డు వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.సన్నవడ్లలో దోడ్డు వడ్ల కలవకుండా చూసుకోవాలని,వ్యవసాయ అధికారి పరిశీలించిన తర్వాత వాటిని పంపాలని పేర్కొన్నారు.రైతులకు ఏ ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి,సిఎస్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ....ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్,సుధీర్,తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,ట్రిని కలెక్టర్ ఉమా హారతి,ఆర్‌డిఓ వాసు చంద్ర,మున్సిపల్ కమిషనర్‌లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పరిగి కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్



**పరిగి అక్టోబరు1,ప్రభాతవార్త :** పరిగి కోర్టు ఆవరణలో మంగళవారం న్యాయవాదులు,కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.కోర్టు పరిసరాలను శుభ్రం చేసి పరిశుభ్రతను పాటిస్తూ,పర్యావరణాన్ని రక్షించాలని సందేశానినన ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీ సూపరిండెంట్ జోష్ణ,బెంచ్ క్లర్క్ అనిల్,అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్,జర్నల్ సెక్రటరీ రాజేందర్ గౌడ్,నర్సింహా రావు,శ్రీశైలం,శ్రీనివాస్ రెడ్డి,యాదయ్య,శివ రెడ్డి,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# వీడిన “మూటలో మహిళ” శవం మిస్టరీ

**షాద్‌నగర్ ఎసిపి ఎన్‌సిహెచ్ రంగస్వామి**



మహిళ హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

**షాద్‌నగర్, అక్టోబరు 1,ప్రభాతవార్త, :** దుర్వ్యసనాలు, దురాశతోనే మహిళను హతమార్చి ఆమె శవాన్ని మూటకట్టి రోడ్డుపై పారేశారని, ఈ హత్య కేసు మిస్టరీని షాద్‌నగర్ పోలీసులు చాకచక్యంగా చేధించారని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఏసీపీ ఎన్‌సిహెచ్ రంగస్వామి వెల్లడించారు. మంగళవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఎన్‌సిహెచ్ రంగస్వామి హాజరై మహిళ హత్య కేసు మిస్టరీని చేధించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీపీ తెలియజేస్తూ షాద్‌నగర్ అంబేడ్కర్ కాలనీలో ఒంటరిగా జీవిస్తున్న కన్నా భాగ్యలక్ష్మీ అలియాస్ లక్ష్మీ (40)ను స్థానిక యాదవ కాలనీలో ఉంటున్న వడ్డె పరమేష్ (43) సెప్టెంబర్ 27న రాత్రి గొంతు పిసికి హతమార్చాడని ఏసీపీ వివరించారు. ఆమె వద్ద ఉన్న చెవి కమ్మలు, తాళిబొట్టు, ఐదు వేల రూపాయల నగదును తీసుకొని ఆమె సెల్‌ఫోన్‌ను డ్రైనేజీలో విసిరేసినట్లు పేర్కొన్నారు. 28వ తేదీన ఉదయం ఫరూఖ్‌నగర్ శ్రీనివాస కాలనీకి చెందిన మహ్మద్ సాదిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలతో శంషాబాద్ డీసీపీ రాజేష్, ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో స్థానిక సీఐ విజయ్ కుమార్, డీఐ ప్రశాంత్, ఎస్ఐలు సుశీల, శరత్, బలరాం, తదితర సిబ్బంది బృందంతో చాకచక్యంగా కేసును దర్యాప్తు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించడంతో పాటు సాంకేతిక సాక్షాధారాలు, పోస్టు మార్టం రిపోర్టు, ఇతర సాక్షాధారాలతో నిందితుడు వడ్డె పరమేష్‌ను అరెస్టు చేయడం జరిగిందని వెల్లడించారు. గత ఎనమిది నెలల క్రితం వడ్డె పరమేష్ గద్వాల జిల్లా నుండి తనకు పరిచయమున్న హనుమంతు అనే వ్యక్తి ద్వారా ఇక్కడ అడ్డాపై కూలీ పనులు చేసేందుకు వచ్చాడని ఏసీపీ తెలిపారు. గత 15 రోజుల క్రితం కన్నా భాగ్యలక్ష్మీతో పరిచయం పెంచుకున్న పరమేష్ ఈనెల 27న రాత్రి ఆమె వద్ద బంగారు ఆభరణాల కోసం గొంతు పిసికి హత్య చేశాడని తెలిపారు. ఒంటరి మహిళలు అపరిచిత వ్యక్తులతో దూరంగా ఉండాలని, ప్రతి సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దురాశతో దుర్వ్యసనాలతో అమాయకుల ప్రాణాలు తీసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేవలం మూడు రోజుల్లోనే కేసు చేధించి, కేసులో పురోగతి సాధించిన సీఐ విజయ్ కుమార్, డీఐ ప్రశాంత్, ఎస్ఐలు సుశీల, శరత్, బలరాం, జోత్స్న, నరేందర్, తదితరులకు ఏసీపీ రంగస్వామి నగదు రివార్డు అందశారు. నిందితుడిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

**బొంరాస్‌పేట్,అక్టోబర్1,ప్రభాతవార్త ః**

బొంరాస్‌పేట్ మండలం ఎన్కేపల్లి గ్రామంలో విద్యుత్‌షాక్ తగిలి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది.ఎస్ఐ అబ్దుల్ రాహూఫ్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన సంగెం అంజిలయ్య వయస్సు (34) తండ్రి వెంకటయ్య వృత్తి వ్యవసాయం అనే వ్యక్తి తన వ్యవసాయ పొలంకు మంగళవారం ఉదయం 6గంటల సమయంలో వెళ్లగా అక్కడ పొలానికి ఏర్పాటు చేసిన కరెంటు తీగతెగిపడటాన్ని గమనించకుండా మృతుడు అంజిలయ్య నడుచుకుంటూ వెళ్ళుతుండగా కరెంటుతీగ ఎడమకాలికి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురికావడం జరిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.మృతుని భార్య సంగెం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రెండు వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

**మేడ్చల్, అక్టోబర్ 1. ప్రభాతవార్త ః** రెండు వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం సోమవారం రాత్రి గుండ్లపోచంపల్లిలో రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు డీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. అదే విదంగా మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో దేవేందర్ అనే వ్యక్తి కామారెడ్డి వైపు వెళుతున్న రైలును ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి మృతి చెందాడు. ఘటనా స్థలాలకు చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మేడ్చల్, అక్టోబర్ 1. ప్రభాతవార్త ః** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శేరిలింగపల్లిలో నివాసముంటున్న కొంపల్లి వెంకట్‌రెడ్డి (55) సెక్యూరిటీ గార్డుగా పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాత్రి ఆయన తన బైక్ పై మేడ్చల్ వైపు వస్తుండంగా మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆగిఉన్న కారు డోర్ తీయడంతో బైక్‌కు తగిలి అతను కిందపడ్డాడు. వెంటనే అతని తలపై నుండి డీసీఎం వాహనం వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు



**యాచారం అక్టోబరు1,ప్రభాతవార్త :**

తెలంగాణ ఆడపడుచుల పండుగగా ప్రఖ్యాతి గాంచిన బతుకమ్మ సంబురాలు కురిమిద్ద పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు తెచ్చిన తీరొక్క పూలతో భక్తిశ్రద్ధలతో పేర్చిన బతుకమ్మలు మధ్యలో పెట్టి ఉపాధ్యాయులు,విద్యార్థులు పాటలతో చక్కగా ఆడి పాడారు.ముఖ్యంగా విద్యార్థులు చక్కటి స్టేప్పులతో వేసిన బతుకమ్మ ఆటా బాగా ఆకట్టుకుంది. ప్రాథమిక పాఠశాల చిన్నారులు వేసిన కోలాటట ఆట చాలా బాగుంది. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగారెడ్డి మాట్లాడుతూ....తెలంగాణలో బతుకమ్మ అన్ని వర్గాలు ఘనంగా జరుపుకునే పండుగగా అభివర్ణించారు.ప్రకృతితో మమేకమై,పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. ఆటపాటలు,మనిషికి ఆహ్లాదాన్ని కలిగించి ఒత్తిడిని జయించే చక్కటి ఔషధంగా పనిచేస్తాయని నేటి ఉరుకుల పరుగుల ప్రపంచంలో అది ఎంతో అవసరమని వారు తెలిపారు.చివరికి పోయినా బతుకమ్మ ,మళ్లీ రావమ్మా అంటూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మను సాగనంపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, శ్రీనివాస్ ,అశోక్,రాణి, వీరమణి,శ్రీదేవి ,శోభారాణి,సౌజన్య,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బాటలో ఎమ్మెల్యే అడుగులు

**-వైకుంఠధామానికి రాజమార్గం**

**-ఫలించిన ఎన్నో ఏళ్ల నాటి కళ**



వైకుంఠదామానికి వెళ్లే రోడ్డు రాజా మార్గాన్ని తలపిస్తున్న దృశ్యం

**నందిగామ అక్టోబరు 1,ప్రభాతవార్త :** అభివృద్ధి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిడి తాండ గిరిజనుల ఎన్నో ఏళ్ల నాటి కళను నెరవేర్చారు.మాజీ సర్పంచ్ జెటావత్ రాజు నాయక్, ఉప సర్పంచ్ విస్లావత్ రాణిల పాలకవర్గం అప్పట్లో స్వర్గాన్ని తలపించలా వైకుంఠదామాన్ని నిర్మించారు.రకరకాల పూల మొక్కలను కరుణించలేదన్న చందంగా వైకుంఠదామానికి రహదారి బాగాలేక రాకపోకలు కొనసాగించడానికి ఎన్నో ఇబ్బందులు పడేవారు.మరోవైపు హెచ్‌బిఎల్ పరిశ్రమకు రావడానికి వాహనాలకు దారి లేక పరిశ్రమ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు రావాలన్నా, అయ్యప్ప దేవాలయానికి భక్తులు రావాలన్నా బాధపడేవారు. వ్యవసాయ పంట పొలాల మధ్య,బురదమయంగా మారిన రహదారిని రైతులు ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని హెచ్‌బిఎల్ పరిశ్రమ యజమానులతో మాట్లాడి సిమెంట్ రోడ్డు వేయించారు.బాటసారులకు ,వాహనదారులకు అందరికీ ఆమోదమోగ్యంగా సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఈ ప్రాంతవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## మాడ్గుల తహసీల్దార్‌గా వినయ్ సాగర్

**మాడ్గుల,అక్టోబర్1,ప్రభాతవార్త:-**

మాడ్గుల తహసీల్దార్‌గా కె.విజయ్ సాగర్ బాధ్యతలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం మాడ్గుల తహసీల్దార్‌గా సునీల్ కుమార్ బాధ్యతలు చేపట్టి ఎన్నికల అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎఓ బదిలీ అయ్యారు.దీంతో సుమారు రెండు నెలలుగా ఖాళీగా ఉన్న తహసీల్దార్ పోస్ట్ వినయ్ సాగర్ బాధ్యతలు చేపట్టడంతో తహసీల్దార్ పోస్ట్ భర్తీ అయింది.దీంతో మండల ప్రజల సమస్యలు తీరుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.దీంతో మంగళవారం మాడ్గుల తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న వినయ్ కుమార్‌కు బిఆర్ఎస్ నాయకులు లాలయ్యగౌడ్,నిరంజన్‌జీ,విజయ్‌కుమార్ నాయక్, మీసేవ,ఆన్‌లైన్ ఆపరేటర్ల వెంకటయ్య,నరసింహగౌడ్,మల్లేష్,ప్రవీణ్ తదితరులు శాలువలతో సత్కరించారు.

# వెనకబడిన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తాం

**-రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**-కుల వృత్తులను నమ్ముకున్న వారికి ఆర్థిక స్వాలంభన కల్పిస్తాం**



మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమావేశంలో సూచనలు తెలియజేస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్ అక్టోబరు 1 ,ప్రభాతవార్త, :**

తెలంగాణ ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి నూతన ఎమ్ఎస్ఎమ్ఈ పాలసీ 2024 విధానాన్ని రూపొందించడంతో వెనకబడిన తరగతుల వర్గాలకు అనుగుణంగా సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. మంగళవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశానికి చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరై ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి నివేదించిన పలు విషయాలను షాద్‌నగర్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాలసీ యొక్క సవరణతో బీసీ వర్గానికి చెందిన మహిళలు, పారిశ్రామికవేత్తలు, నిరుద్యోగ యువతీ యువకులకు ప్రయోజనం చేకూరే విధంగా ప్రభుత్వానికి తన నివేదన తెలియజేసినట్లు చెప్పారు. వడ్డెర కులస్థులకు ఆర్థిక స్వాలంభన కల్పనలో భాగంగా క్వారీలు కేటాయించాలని, అనాదిగా వస్తున్న కులవృత్తిని ప్రోత్సహించడంలో భాగంగా వారికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా క్షౌర వృత్తి వర్గాలకు సంబంధించిన విషయంలో మాట్లాడుతూ కార్పోరేట్ స్థాయిలో ఏర్పాటు చేసిన బార్బర్ షాపుల వల్ల ఈ వృత్తిపై ఆధారపడ్డ వారు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. దీనిపై ఒక రెగ్యులేటరీ అధారిటీని ఏర్పాటు చేసి కార్పోరేట్ సంస్థలను నియంత్రించాలని కోరినట్లు తెలిపారు. కుమ్మరి కులస్థులకు వారి గ్రామ పరిధిలో ఉన్న చెరువుల్లో ఎలాంటి షరతులు లేకుండా ఒండ్రు మట్టిని తరలించేందుకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమాజంలో అందరు శుభ్రంగా ఉండేందుకు తోడ్పడే చాకలి కులస్థులకు కాలానుగుణంగా అత్యాధునిక మాడ్రన్ దోభి ఘాట్‌లను ఏర్పాటు చేయుటకు ఆర్థిక సహకారంతో పాటు ఇతర వసతులు కల్పించాలని కోరారు. ఎంఎస్ఎమ్ఈ పాలసీ 2024 లో భాగంగా నూతన పారిశ్రామికవాడలు ఏర్పాటు చేస్తే బీసీలకు సముచిత కేటాయింపులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ రాజ్యసభ సభ్యులు కేశవరావు, బీసీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, రాష్ట్ర ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి పాల్గొన్నట్లు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

# బోడుప్పల్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం స్థల పరిశీలన

**-సందర్శించిన డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ టి.రఘునాధస్వామి**



మేడ్చల్ జిల్లాలోని బోడుప్పల్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం సందర్శించి స్థలాన్ని పరిశీలించిన జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ టి.రఘునాధస్వామి,తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 1, ప్రభాతవార్త**

బోడుప్పల్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ టి.రఘునాధస్వామితో పాటు అధికారుల బృందం వారు సందర్శించి పరిశీలించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం కోసం ఆ స్థలం అనుకూలత కోసం సవివరంగ పరిశీలించింది. ఈ యుపిహెచ్‌సి స్థాపన వల్ల నగర జనాభాకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించటానికి సహకారం అందనున్నట్లు అధికారుల సమీక్ష ద్వార స్పష్టం అవుతున్నట్లు తెలిపారు. ఆ తరువాత బోడుప్పల్ మున్సిఫల్ కార్యాలయంలో కమిషనర్‌ను వారి కార్యాలయంలో కలిసి ఈ ప్రాజెక్టు నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగ మౌళిక వసతులు, నిధుల కేటాయింపులు, ఆరోగ్య,మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం పైన చర్చించి ప్రాజెక్టును త్వరగా పూర్తి కావటానికి అవసరమైన చర్యలపై చర్చించారు. ఆ తరువాత నూతనంగ నిర్మించిన నారాపల్లిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని కొర్రెముల గ్రామంలోని సబ్ సెంటర్‌ను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఓతో పాటు కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రా మ్ ఆఫీసర్ మంజులారెడ్డి, వైద్య అధికారి డాక్టర్ శోభనా, బస్తీ దావాఖాన వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్, పలువురు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమీకృత గురుకుల భవనాల నిర్మాణాలకు సన్నాహాలు

**-భవనాల నిర్మాణాల స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్ జైన్**



సమీకృత గురుకుల పాఠశాల భవనాల స్దలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**కొడంగల్,అక్టోబర్ 1ప్రభాతవార్త :**

సమీకృత గురుకుల పాఠశాలలను ఒకే చోట నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.దీంతో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ మండలంలోని పాతకొడంగల్ సమీపంలో ఉన్న గిరిజన గురుకుల పపాఠశాల భవనం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో సమీకృత గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసేందుకు గాను ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఈక్రమంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి అనువైన స్దలాన్ని పరిశీలించారు.సమీకృత గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.రోడ్డు మార్గం ఇబ్బందిగా ఉండడంతో మహబూబ్‌నగర్-తాండూర్ ప్రధాన రహదారికి ఆనుకొని రోడ్డు ఏర్పాటు చేసేలా చూడాలని,రోడ్డు నిర్మాణానికి గాను భూములు ఇస్తున్న రైతుల వివరాలు,సర్వేనెంబర్‌లు అందించాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు.ప్రస్తుతం వేసిన పంటలు చివరి దశలో ఉన్నాయని పంటలు పూర్తికాగానే రోడ్డు పనులు ప్రారంబించేలా చర్యలు చేపడుతామని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.కాగా మండల పరిధిలోని పాతకొడంగల్ సమీపంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల,కళాశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించచారు.ప్రధానంగా పాఠశాలలోని మరుగుదొడ్లు,తరగతి గదులను పరిశీలించి సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు సూచించారు.గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్యపై ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో తాగునీటి సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌కు ఆదేశించారు.

అనంతరం స్దానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూశాఖ మంత్రి పొగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.కలెక్టర్ వెంట శిక్షణ కలెక్టర్ ఉమా హారతి,ఎంపీడీఓ ఉషాశ్రీ,రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

